క్లుప్తంగా

వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (పొగతోట): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో కాలువలను శుభ్రపర్చి, వ్యర్థాలను రోడ్డుపై వేశారు. ఈ అంశమై 'బాబోయ్.. దోమలు' అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్పొరేషన్ అధికారులు వీటిని తొలగించి సమస్యను పరిష్కరించారు.

కవచాల బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో కొలువైన అమ్మవారికి బంగారుపూత పూసిన 4.203 కిలోల కవచాలను జగన్నాథరావు, పుష్పారావు దంపతులు బుధవారం బహూకరించారు. విశేష దినాల్లో అమ్మవారిని వీటితో అలంకరించనున్నామని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నిత్యహోమం, గోపురోత్సవం, మహాకుంభప్రోక్షణ, మహాపూర్ణాహుతి తదితరాలను నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠపాలిత గురుదత్తాత్రేయ మఠంలో నిర్వహించనున్న సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, తిరుపతి శ్రీశక్తిపీఠాధీశ్వరులు రమ్యానంద భారతి నెల్లూరుకు బుధవారం రాత్రి ఆగమనం చేశారు. ఈ సందర్భంగా నగరంలో శోభాయాత్రను వేడుకగా నిర్వహించారు. విశేష పుష్పాలంకారంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన శకటాలపై వీరు ఆశీసులై భక్తులను అనుగ్రహించారు. తొలుత వేదాయపాళెంలో గంగమ్మ తల్లికి హారతులిచ్చారు. కార్యక్రమంలో పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ, ప్రతిష్ఠ మహోత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీధర్, మధుసూదన్‌రావు, దొంతంశెట్టి వినయ్, లోకేష‌బాబు, చల్లగుండ్ల మోహన్‌రావు, పాలడుగు సాయి, బొనిగి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. కోటమిట్టలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో నెల్లూరు టౌన్ డివిజన్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు సురేఖ, ఆశాలత, ఏఈలు విజయ్‌కుమార్, కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటేనా..?



పచ్చదనం కరువై.. కళావిహీనంగా పార్కు



పేరుకుపోయిన చెత్త

- పార్కు నిర్వహణ గాలికి
- ఆలనాపాలనా లేక అధ్వానంగా మారిన వైనం
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

నెల్లూరు(బారకాసు): పార్కులను ఏర్పాటు చేసి నగరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంచుతామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధంగా ఉంటున్నాయి. కొత్త వాటిని ఏర్పాటు చేసే మాట అటుంచితే, ఉన్న వాటిని సక్రమంగా నిర్వహించే అంశంలో అధికారులు దారుణంగా విఫలమవుతున్నారు. ఫలితంగా అవి కళావిహీనంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

ఎంతో కాలం నిలవలేదు..

వాస్తవానికి నగరంలో ఏర్పాటు చేసే పార్కులను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ కోవలోనే ఐదో డివిజన్లోని సత్యనారాయణపురంలో గల ఎస్వీఆర్ స్కూల్ పక్కన పార్కును ఇటీవల ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పార్కు ఆధునికీకరణకు రూ.20 లక్షలను వెచ్చించారు. ఈ ఏడాది మార్చిలో పనులను ప్రారంభించి రెండు నెలలో పూర్తి చేశారు. ఎంతో ఆహ్లాదకరంగా ఉండటంతో స్థానికులు ఇక్కడికి రోజూ వచ్చి సేదదీరేవారు. అయితే పర్యవేక్షణ లేమి దీనికి శాపంగా పరిణమించింది.

నేడు దుర్భరంగా..

ప్రస్తుతం ఈ పార్కు రూపు కోల్పోయింది. మందుబాబులకు రాత్రి వేళ ఇది అడ్డాగా మారుతోంది. పార్కులోని సిమెంట్ బెంచీలు, మోటార్, నీటిని చిమ్మే పైపులను మద్యం మత్తులో పగలగొట్టారు. దీంతో పార్కులోని మొక్కలకు నీరు పట్టే అవకాశం లేక అవి ఎండిపోయాయి. తినుబండారాలు, వాటర్ ప్యాకెట్లను ఇక్కడే పడేస్తుండటంతో అపరిశుభ్రత తాండవిస్తోంది.

అలంకారప్రాయంగా..

పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టి అలంకారప్రాయంగా మారాయి. ఫలితంగా ఇక్కడికి వచ్చే వారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పార్కుకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా మారింది



సత్యనారాయణపురంలో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అయితే పర్యవేక్షణ కొరవడటంతో కొంతకాలానికే అధ్వానంగా తయారైంది. పూర్వ వైభవం తీసుకొచ్చేలా అధికారులు చొరవ చూపాలి.

– సుబ్బారెడ్డి, శ్రీనివాసనగర్

పట్టించుకునేవారేరీ..?



పార్కులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నిర్వహణను పట్టించుకున్న దాఖలాల్లేవు. పార్కు ఆధునికీకరణ పనులు పూర్తి చేసిన కొద్ది రోజులకే కళావిహీనంగా తయారైంది. పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రమణారెడ్డి, సత్యనారాయణపురం

వాకర్స్ సేవలు అభినందనీయం

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ సేవలను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అభినందించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో స్టేడియంలో వాటర్ ట్యాంక్‌ను రూ.15 లక్షలతో నిర్మించామని, మహిళా వాకర్స్‌కు ప్రోత్సాహకంగా రూ.50 వేలను అందజేసిన అంశాన్ని గుర్తుచేశారు. అనంతరం సుమారు 300కుపైగా వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. మేకపాటిని సత్కరించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసకుమార్, శ్రీధర్‌రెడ్డి, సత్యనాథ్, అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, సెక్రటరీ గుర్రం వెంకటసురేంద్రబాబు, వేలూరు రంగారావు, ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, రమణయ్యగౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు



ఉత్తర్వులను అందజేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరికి సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు పద్మావతి, సిద్ధిఖీకి ఉత్తర్వులను తన చాంబర్‌లో కమిషనర్ సూర్యతేజ బుధవారం అందజేశారు. విధి నిర్వహణలో మరింత మెరుగైన ప్రతిభ చూపాలని కాంక్షించారు.

- కమిషనర్ సూర్యతేజను అదనపు కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు.
- ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నగరంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ముత్తుకూరు రోడ్డు కూడలిలో జరుగుతున్న ప్యాచ్ వర్క్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈఈ సాయిరామ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడకపోతే చర్యలు



నెల్లూరు(క్రైమ్): నేరాలు జరుగుతుంటే ఏమి చేస్తున్నారు.. నిర్లక్ష్యాన్ని వీడకపోతే కఠిన చర్యలు తప్పవని గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా హెచ్చరించారు. నగరంలోని రైల్వే సీఐ కార్యాలయంలో రైల్వే సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. స్టేషన్ల వారీగా రికార్డులను పరిశీలించారు. పలు కేసుల పెండెన్సీ, దొంగతనాలు, దోపిడీ కేసుల్లో దర్యాప్తు ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రయాణికుల భద్రత నిమిత్తం రైళ్లలో నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ నిఘా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగరావు, షరీఫ్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల ఎస్సైలు చెన్నకేశవరావు, మాలకొండయ్య, అరుణకుమారి, కొండయ్య పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుకే కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): ప్రపంచ రొమ్ము కేన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో అతి తక్కువ ఖర్చుకే బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నామని ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆస్పత్రిలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆంకాలజీ ఫిజీషియన్ హరిత మాట్లాడారు. మహిళలకు ఉచిత కన్సల్టేషన్‌తో పాటు రూ.1499 విలువైన స్క్రీనింగ్ పరీక్షలను రూ.499కే చేయనున్నామని వివరించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ మనోభిరామ్, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో పరిశీలన



నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని డంపింగ్ యార్డును ఎంహెచ్‌ఓ చైతన్య బుధవారం పరిశీలించారు. యార్డు లోపల వరకు వాహనాలు వెళ్లకుండా గేట్ సమీపంలోనే వ్యర్థాలు వేస్తున్న అంశాన్ని గుర్తించారు. ఈ రకంగా వ్యవహరించడం తగదని సిబ్బందిని హెచ్చరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం సమీపంలో నిర్మించిన స్క్రాప్ షెడ్‌ను పరిశీలించారు. నగరపాలక సంస్థ ద్వారా ట్రేడ్ లైసెన్స్‌ను పొందారా అనే అంశాన్ని ఆరాతీశారు.

బాణసంచా అందజేత



నెల్లూరు(బృందావనం): దీపావళిని పురస్కరించుకొని వసంతోపు సెంటర్‌లోని జనహిత, వాత్సల్య కేంద్రానికి బాణసంచాను బీజేపీ నేతలు మిడతల రమేష్, నీలిశెట్టి లక్ష్మణరావు బుధవారం అందజేశారు. పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కాంక్షించారు. కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై సమావేశం



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ రహిత జిల్లాగా నెల్లూరును మార్చేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని ఏడీ ఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. టీబీ నివారణపై దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ నోటిఫై.. పరీక్షించడం.. మందులు రోగికి చేరువై సద్వినియోగం చేసుకునేలా కృషి చేయడం.. తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. ఎన్టీఈపీ ప్రోగ్రామ్ తదితర అంశాలపై చర్చించారు.

అయోడిన్ లోపిస్తే సమస్యలు



నెల్లూరు(అర్బన్): తగినంత అయోడిన్ అందకపోతే పిల్లల శారీర, మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని జిల్లా ఫ్లోరోసిస్ నివారణాధికారి డాక్టర్ దివ్య పేర్కొన్నారు. అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని ఈఎస్సార్ మున్సిపల్ హైస్కూల్, మల్లికార్జునపురం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన సదస్సును జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అయోడిన్ కలిగిన ఉప్పును ఆహార పదార్థాల్లో వినియోగించాలని కోరారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ ప్రతిమ, ఎన్సీడీ సోషల్ వర్కర్ హాసిని, సీఓ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న గోవిందు

నెల్లూరు(అర్బన్): ర్యాగింగ్‌కు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందు పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సును యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. కళాశాలలో ఒకరిద్దరిపై ఫిర్యాదు లొస్తున్నాయని చెప్పారు. ర్యాగింగ్ పేరిట జూనియర్లను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ర్యాగింగ్ భూతానికి అమాయక విద్యార్థులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు వైద్య కోర్సును ఇక్కడ అభ్యసిస్తున్నారని, వీరి భాష, దుస్తులు, ఆహార అలవాట్లలో భిన్నత్వం సహజంగా ఉంటుందన్నారు. వీరిని కించపర్చినా, వాట్సాప్ సందేశాల ద్వారా జూనియర్ బాలికలను ఇబ్బంది పెట్టినా, కళాశాల బయట బాధపడే మాటలు మాట్లాడినా సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య మాట్లాడారు. ర్యాగింగ్ చేశారని తెలిస్తే అలాంటి వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ర్యాగింగ్ జరిగిందనే అంశం విచారణలో తేలితే అప్పుడు ఫిర్యాదుదారులతో సంబంధం లేకుండా కేసులు పెట్టి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. న్యాయవాది గిరి, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, డాక్టర్లు మస్తాన్‌బాషా, గీతాదేవి, మునీర్‌ఖన్నా గంగాధర్, కళారాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై అవగాహన

నెల్లూరు(క్రైమ్): అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సంతపేట పోలీస్‌స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పోలీసుల విధి నిర్వహణ.. కేసుల నమోదు.. స్టేషన్ పనితీరు.. ఆయుధాల వినియోగం.. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, బాలల రక్షణ చట్టాలు.. తదితర అంశాలపై శ్రీలక్ష్మి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఎస్సైలు బాలకృష్ణ, సుల్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఇదేనా మాకిచ్చే విలువ..?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన
- గ్రామసభలపై కనీస సమాచారమివ్వడంలేదు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గ్రామసభలపై తమకెలాంటి సమాచారమివ్వడంలేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. 13 మంది ఎంపీటీసీలకు గానూ 10 మంది.. 18 మంది సర్పంచ్‌లకు గానూ ఎనిమిది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఎంపీపీ విజయ్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో 18 పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా గ్రామసభలపై ఆయా ఎంపీటీసీలకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

రూ.రెండు కోట్ల విడుదల

రూరల్ మండలానికి రూ.రెండు కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. మేజర్ పంచాయతీలకు రూ.20 లక్షలు, రెండు వేల జనాభా కలిగిన పంచాయతీలకు రూ.10 లక్షలు, వెయ్యి మంది జనాభా కలిగిన పంచాయతీలకు రూ.ఐదు లక్షల మేర కేటాయించనున్నామని వెల్లడించారు. గ్రామాల్లో ఎక్కువ పనులు చేస్తే ప్రత్యేక గ్రాంట్లు విడుదలవుతాయని తెలిపారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు, మండల కో ఆప్షన్ సభ్యుడు మీరామోహిద్దీన్, మండల ఉపాధ్యక్షులు దేవసేనమ్మ, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

జాబ్ కార్డులను కేటాయించలేదు



గ్రామంలోని గిరిజన కాలనీలో 150 కుటుంబాలకు జాబ్‌కార్డులను కేటాయించలేదు. గ్రామసభలపై ఎంపీటీసీలకు కనీస సమాచారమివ్వడంలేదు.

– శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ, కందమూరు

చెప్పేదొకటి.. జరిగేదొకటి



గ్రామంలో పేదలకు ఇళ్ల కేటాయింపులో హౌసింగ్ అధికారులు చెప్పేదొకటి.. జరిగేది మరొకటి. ఉప్పుటూరులోని లేఅవుట్ అడవిని తలపిస్తోంది.

– సుబ్బారెడ్డి, సర్పంచ్, ఉప్పుటూరు

మద్యానికి డబ్బివ్వాలని బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): మద్యం సేవించేందుకు నగదును ఇవ్వాలంటూ వ్యాపారిని కత్తితో బెదిరించి దోచుకున్న ఘటనలో ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని చంద్రమౌళీనగర్ ఐదో వీధిలో శ్రీకృష్ణసాయి పేరుతో ప్రావిజన్స్ షాపును సుబ్బారావు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో షాపు వద్దకు జ్యోతినగర్‌కు చెందిన సస్పెక్టెడ్ షీటర్ సాజిద్ అతని స్నేహితుడు విజయ్‌కుమార్ మంగళవారం రాత్రి వచ్చారు. మద్యం సేవించేందుకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేయగా, లేవని ఆయన చెప్పారు. కత్తితో చంపుతామని బెదిరించి రూ.500ను తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

పెనుబర్తిలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న నాగమోహన్

నెల్లూరు సిటీ: పెద్ద చెరుకూరు, పెనుబర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరిని ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలను మండల వ్యవసాయాధికారి నాగమోహన్ తెలియజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి శేషాద్రి, వ్యవసాయ సహాయకుడు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో వైన్ షాపులా..?

- నారాయణ విద్యాసంస్థల సమీపంలో ఏర్పాటు చేస్తే అంగీకరిస్తారా..
- మహిళల నిరసనలకు చంద్రశేఖర్‌రెడ్డి మద్దతు



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 16వ డివిజన్లో ఓ ప్రైవేట్ స్కూల్ పక్కనే అపార్ట్‌మెంట్‌కు ముందు మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం అక్కడికెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణ ఏర్పాటు సరికాదని హితవు పలికారు. జాతీయ రహదారి కూడలి వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు ఎక్కువయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం షాపులకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజలకు ఇబ్బంది లేని చోట ఏర్పాటు చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. నగరంలోని నారాయణ విద్యాసంస్థల పక్కనే వైన్ షాపులను ఏర్పాటు చేస్తే మంత్రి అంగీకరిస్తారానని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్థానికుల ఇబ్బందులను గుర్తించి ఈ ప్రాంతంలో మద్యం దుకాణ ఏర్పాటును విరమించుకోవాలని మంత్రి నారాయణను కోరారు. లేని పక్షంలో స్థానికులకు మద్దతుగా నడిచేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, నేతలు సగిలి జయరామిరెడ్డి, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, కార్పొరేటర్లు వేలూరు మహేష్, ఊటుకూరు నాగార్జున, జయలక్ష్మి, నేతలు నేతాజీ సుబ్బారెడ్డి, అబ్దుల్ మస్తాన్, మాబాషా, యస్దానీ, కరిముల్లా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెప్పు కోసమే వైఎస్సార్సీపీపై ఆరోపణలు



మాట్లాడుతున్న నాగార్జున

నెల్లూరు(బారకాసు): మంత్రి నారాయణ వద్ద మెప్పు పొందేందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ అనవసర ఆరోపణలు చేస్తున్నారని 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున విమర్శించారు. డివిజన్లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. డివిజన్లోని పార్కు సమీపంలో టీడీపీ వారు ఏర్పాటు చేయబోయిన అక్రమ నిర్మాణం, కుట్రలను బహిర్గతం చేశారు. అక్రమ నిర్మాణాన్ని ప్రశ్నించిన పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై భువనేశ్వరిప్రసాద్ మాట్లాడటంపై మండిపడ్డారు. డివిజన్లో రాజకీయ విద్వేషాలను రేపేందుకు టీడీపీ నేతలు యత్నిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై తాము కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, దీంతో గోతులను టీడీపీ నేతలు పూడ్చేసి జెండా దిమ్మె నిర్మాణం కోసం అని చెప్తారన్నారు. జెండా దిమ్మె కోసం పెద్ద ఎత్తున గోతులు తీసి, నిర్మాణాన్ని ఎవరైనా అర్ధరాత్రి సాగిస్తారానని ప్రశ్నించారు. నెల్లూరును హైఫై సిటీగా మారుస్తానని చెప్పిన మంత్రి, నేడు లిక్కర్ సిటీగా మార్చారని ధ్వజమెత్తారు. నేతలు శంకర్‌రెడ్డి, శేషు, మురళి, లక్ష్మయ్య, సలీమ్‌కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.